పేజీలు :4
వెల :5/-

జాతీయ తెలుగు దినపత్రిక
www.mediatodaydaily.com

# మీడియా టుడే

హైదరాబాద్, సోమవారం 3 మార్చి 2025
మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

## కాంగ్రెస్ పార్టీలో
# మీనాక్షి టెన్షన్

### – గీత దాటితే దబిడి దిబిడే



**హైదరాబాద్ మీడియా టుడే:** కాంగ్రెస్ పార్టీలో క్రమ శిక్షణ అనగానే నవ్వొస్తుంటుంది. ఆ పార్టీలో ఎప్పుడు ఎవరు ఎలా ఉంటారో అర్థం చేసుకోవడం కష్టం. ఆ పార్టీలో అంతర్గత స్వేచ్ఛ ఎక్కువని, ఎవరు ఎలా మాట్లాడినా పట్టించుకునే వాళ్లుండరని చాలా మంది భావిస్తూ ఉంటారు. ఆ పార్టీ నేతలు కూడా పార్టీ సిద్ధాంతాలతో పని లేకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ ఉంటారు. తెలంగాణ కాంగ్రెస్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఇక్కడ కూడా అలా గీత దాటే నేతలెంతో మంది ఉన్నారు. అయితే ఇప్పుడు అలాంటి నేతలందరూ వణికిపోతున్నారు. ఇందుకు కారణం రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్.మీనాక్షి నటరాజన్ కొత్తగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జ్ గా నియమితులయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల పరిశీలకురాలిగా కూడా ఆమె పని చేశారు. ఇప్పుడు ఆమె బాధ్యతలు చేపట్టగానే యాక్షన్ లోకి దిగిపోయారు. సహజంగా పార్టీ ఇన్ ఛార్జ్ లు హంగామా చేస్తుంటారు. వాళ్లను ప్రసన్నం చేసుకునేందుకు స్థానిక నేతలు హడావుడి చేస్తూ వాళ్ల కళ్ళలో పడేందుకు తాపత్రయ పడుతుంటారు. అయితే మీనాక్షి నటరాజన్ మాత్రం విమానంలో కాకుండా రైల్లో హైదరాబాద్ వచ్చారు. సాదాసీదాగా ఎలాంటి హడావుడి లేకుండా ల్యాండ్ అయ్యారు.నేరుగా గాంధీ భవన్ వెళ్లిన మీనాక్షి నటరాజన్ అక్కడి హోర్డింగులు, బ్యానర్లు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటి వల్ల ఓట్లు రాలవన్నారు. అంతేకాదు బొకేలు, కండువాలు లాంటివి తనకు అవసరం లేదని వాటిని తీసుకురావద్దని తేల్చి చెప్పారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారని తెలిసి వెంటనే ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. మల్లన్న వ్యవహారాన్ని ఇన్నాళ్లూ నాన్చుతూ వచ్చింది పార్టీ హైకమాండ్. కానీ మీనాక్షి నటరాజన్ మాత్రం ఏమాత్రం ఆలస్యం చేయకుండా మల్లన్నపై వేటు వేశారు.తాజాగా పార్టీ సీనియర్ నాయకులు వీహెచ్ పైన కూడా మీనాక్షి నటరాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణనపై చర్చించేందుకు వీహెచ్ తన నివాసంలో పలు పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఇది మీనాక్షి నటరాజన్ వరకూ చేరింది. దీనిపై వీహెచ్ నుంచి వివరణ తీసుకోవాల్సిందిగా పీసీసీని ఆదేశించారు మీనాక్షి నటరాజన్. ఇది అందరినీ కంగు తినిపించింది. వీహెచ్ లాంటి సీనియర్ నేత నుంచి కూడా వివరణ కోరడంపై ఆశ్చర్యపోతున్నారు. దీన్ని బట్టి తనకు పార్టీ తప్ప మరొకటి అవసరం లేదని, ఎంతటివారైనా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే శిక్ష తప్పదనే హెచ్చరికలను పంపుతున్నారు మీనాక్షి నటరాజన్. దీంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు వణికిపోతున్నారు.



# రంగంలోకి రోబోలు

### – ఎస్ఎల్బీసీ సహాయక చర్యల పరిశీలన
### – ఇది ఒక విపత్తు, అందరం సానుభూతి ప్రకటించాల్సిన సమయం

**హైదరాబాద్ మీడియా టుడే:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం సొరంగంలో 8 మంది సిబ్బంది గల్లంతైన నేపథ్యంలో సహాయక చర్యలను పరిశీలించేందుకు మంత్రులతో కలిసి సీఎం రేవంత్ టన్నెల్ లోనికి వెళ్లారు.

ఆ తర్వాత ఎస్ఎల్‌బీసీ వద్ద అన్ని విభాగాల అధికారులు, ఏజెన్సీలు, రెస్క్యూ టీంలతో సహాయక చర్యలపై సమీక్షించారు. అనంతరం సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 2005-06లో ప్రారంభించారని తెలిపారు. 2014 తెలంగాణ ఏర్పడేనాటికి 32 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయిందన్నారు. అయితే, గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదన్నారు. ఈ పనులు చేస్తున్న సంస్థ విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ సరఫరా కూడా నిలిపివేసిందన్నారు. దీంతో గత పదేళ్లుగా టన్నెల్ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని సీఎం రేవంత్ తెలిపారు.నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని నిర్ణయించామని.. అందుక కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆగిపోయిన ఈ ప్రాజెక్టు పనులను తిరిగి ప్రారంభించామని రేవంత్ చెప్పారు. అయితే, అనుకోకుండా ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. జాతీయ స్థాయిలో నిపుణులైన 11 కేంద్ర సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు 9 రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గల్లంతైన 8 మంది ఆచూకీ ఇప్పటి వరకూ తెలియరాలదన్నారు. ఈ ఆపరేషన్ కొలిక్కి రావడానికి మరో రెండు మూడు రోజులు సమయం పడుతుందన్నారు. కన్వేయర్ బెల్ట్ పాడవడం వల్ల సిల్టు తొలగించేందుకు ఆటంకమేర్పడిందన్నారు.సోమవారం సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ అందుబాటులోకి వస్తుందని దీంతో మట్టి బురదను వేగంగా తొలగించవచ్చని సీఎం రేవంత్ తెలిపారు. సొరంగంలో గల్లంతైన కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలన్నారు. ఎలాంటి ప్రాణనష్టం ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో మనుషులు, మిషిన్లతోపాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. టన్నెల్ బాధితులను బయటికి తీయడంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయడం లేదని సీఎం రేవంత్ చెప్పారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## రేవంత్ రెడ్డీ... నీకు చేతనైతే
# చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు

### – హరీశ్ రావు విమర్శలు



**హైదరాబాద్ మీడియా టుడే:** సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలపరిశీలనకు వెళ్లడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. మీ రాజకీయ ప్రయోజనాల కోసం సాంకేతికపరమైన అంశాలు నిర్లక్ష్యం చేసి ఆదరాబాదరాగా ఎస్ఎల్బీసీ పనులను పరుగెత్తించారని విమర్శించారు. కార్మికులు వద్దని వారిస్తున్నా వినకుండా వారిని మృత్యుకుహరంలోకి నెట్టారని మండిపడ్డారు. కార్మికుల ప్రాణాలు బలితీసుకుని ఇప్పుడు కుహనా ఏడ్పులు ఏడుస్తున్నారని ధ్వజమెత్తారు. నీకు నిజాయతీ ఉంటే ఎస్ఎల్బీసీ ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులు ఎవరో తేల్చాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పచ్చి అబద్ధాలు మాట్లాడడం, నోటికి వచ్చినట్టు కారుకూతలు కూయడం ఇక ఆపేయాలని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే పనులు జరగవని, ఒళ్లు వంచి పనిచేస్తేనే పనులు జరుగుతాయని తెలిపారు. 15 నెలలైనా నీకు జ్ఞానోదయం కాకపోవడం తెలంగాణ దౌర్భాగ్యం అని హరీశ్ రావు పేర్కొన్నారు."కేసీఆర్ హయాంలో ప్రాజెక్టుల పనులు ఆగలేదు కాబట్టే రేవంత్ రెడ్డి అప్పుడేమీ మాట్లాడలేకపోయాడు. నిధులు ఖర్చు చేయకుండానే 11.48 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు జరిగాయా? 2014 నుంచి 2023 వరకు రూ.3,900 కోట్లు ఖర్చు చేసి 11.48 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్విన విషయాన్ని ఎందుకు దాచిపెడుతున్నారు? కేసీఆర్ అంటే పచ్చని పంట పొలాలు రేవంత్ రెడ్డి అంటే పచ్చి అబద్ధాలు అని ప్రజలకు కూడా అర్థమైంది. మేం పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రితో సత్సంబంధాలు కొనసాగించాం అంతే తప్ప పక్క రాష్ట్ర సీఎం తరఫున సూట్ కేసులు మోయలేదు. ఏపీ సీఎం చంద్రబాబు రోజుకు 10 వేల క్యూసెక్కులు తరలించుకుపోతున్నాడు ప్రశ్నిస్తున్న మాపై రంకెలు వేయడం కాదు నీకు చేతనైతే చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు. బీజేపీతో పగలు కుస్తీ రాత్రి దోస్తీ. ఎస్ఎల్బీసీ టన్నెల్ సందర్శనకు వచ్చిన బీఆర్ఎస్ నేతలను ఎందుకు ఆపారు? బీజేపీ నేతలకు ఎలా స్వాగతం పలికారు?" అంటూ హరీశ్ రావు విమర్శనాస్త్రాలు సంధించారు.

# ఆర్టీసీలో ఆన్‌లైన్ పేమెంట్స్

### – చిల్లర సమస్యను పరిష్కరించేందుకు నిర్ణయం




**హైదరాబాద్ మీడియా టుడే:** ఆర్టీసీ బస్సుల్లో చిల్లర సమస్యను తీర్చేందుకు యాజమాన్యం కీలకనిర్ణయం తీసుకుంది. క్యూఆర్‌కోడ్ స్కానింగ్‌తో ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం కల్పించింది. ప్రయాణికులు బస్సుల్లో వెళ్లే సమయాల్లో తగినంత చిల్లర లేకపోవడం.. ఈ విషయంలో కండక్టర్లకు సమస్యలు ఉత్పన్నమవుతుండటంతో సమస్యకు స్వస్తి పలికేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టంలో భాగంగా ఆన్‌లైన్ టికెటింగ్ తీసుకొచ్చామని పేర్కొన్నారు. త్వరలో మరిన్ని ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

## మహిళలకు సీఎం చంద్రబాబు
# శుభవార్త





### – ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణి చేయనున్న ప్రభుత్వం

**అమరావతిమీడియా టుడే** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలకు సీఎం చంద్రబాబు శుభవార్త చెప్పారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పే ప్రయత్నం చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆర్థిక భరోసా కలిగించేలా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఈనెల 8వ తేదీ నుంచి మహిళలకు ఉపాధి కల్పించేలా కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించనుంది.టైలరింగ్ లో నిష్ణాతుల ఆధ్వర్యంలో 90 రోజులపాటు వారికి శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే ఏపీలో చంద్రబాబు సర్కార్ మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను ఇస్తున్న విషయం తెలిసిందే. ఇక తాజాగా టైలరింగ్ లో కూడా శిక్షణ అందజేసి ఉచితంగా కుట్టు మిషన్లు ఇచ్చి మహిళల జీవనోపాధికి దోహదం చేయనుంది. ద

సమాజాభివృద్ధిలో మహిళలకు కీలకమైన స్థానం ఉందని గుర్తించిన క్రమంలోనే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గానికి చెందిన 1,02,832 మంది మహిళలకు కుట్టుమిషన్లను అందజేయాలని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం 255 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేయబోతోంది. బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా 46,044 మందికి, ఈడబ్లూఎస్ సామాజిక వర్గానికి చెందిన 45,772 మందికి, కాపు కార్పొరేషన్ ద్వారా 11,016 మందికి కుట్టు మిషన్లను ఇవ్వనుంది.ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం కూడా చివరి దశకు చేరుకుంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేవలం టైలరింగ్ శిక్షణ మాత్రమే కాకుండా ఈవెంట్ మేనేజ్మెంట్ నిర్వహణ యూనిట్ల ఏర్పాటులోనూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారు జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేయడం డెయిరీ, గొర్రెల యూనిట్లను ఏర్పాటు చేయడంలోనూ మహిళా లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.ఇక ఇదే విషయాన్ని ఏపీ మహిళా మంత్రి సవిత పేర్కొన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్రే కీలకమని నమ్మిన వ్యక్తి చంద్రబాబు అని ఆమె అభిప్రాయ పడ్డారు.

ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,02,832 మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత కోరారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

## – కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఈ వేసవిలో తాగునీటికి ఎలాంటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఇవాళ చండూరు మునిసిపల్ కార్యాలయంలో చండూరు మున్సిపాలిటీ, చండూరు గ్రామీణ ప్రాంతంలో తాగు నీటి సరఫరాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.
చండూరు మున్సిపాలిటీతోపాటు, గ్రామపంచాయతీలలో జనాభా ఆధారంగా తాగునీటిని ఇవ్వాలని, ఎక్కడైనా మిషన్ భగీరథ తాగునీటి వనరులు, బోర్లు చెడిపోయిన, మైనర్ రిపేర్లు ఉన్నట్లయితే గుర్తించి వాటి మరమ్మతులకు కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సూచించారు. అలాగే పైపు లైన్ లీకేజీలను అరికట్టి తాగు నీరు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

### తాగేందుకు మాత్రమే వాడాలి..

మిషన్ భగీరథ త్రాగునీటిని కేవలం తాగేందుకు మాత్రమే వినియోగించాలన్నారు. తాగునీటి విషయంలో అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులకు గురి కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలో 9వ వార్డులో ఉన్న జీఎస్ఎల్ఆర్‌ను పరిశీలించారు. అలాగే ఏడో వార్డులో నిర్మాణంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్‌ను తనిఖీ చేశారు.

ఈ సమీక్షలో పాల్గొన్న వారిలో అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, చండూరు ఆర్డీవో శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ మునావర్ అలీ, పబ్లిక్ హెల్త్ డీఈ మనోహర ,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పూజిత, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, ఎంపీడీవో రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

# సమాజానికి దిక్సూచి పంచాంగం

## – మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్గొండ కల్చరల్ (రామగిరి), : సమాజానికి దిక్సూచి పంచాంగం. హిందూ ధర్మ సాంప్రదాయాల్లో ఏ శుభకార్యాలు నిర్వహించాలన్న పంచాంగంలోని తిథులు, ఘడియల ఆధారంగానే నిర్ణయించడం జరుగుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలు అన్నారు.దనల్గొండ జిల్లా జిల్లా వైదిక బ్రాహ్మణ సంఘం, జిల్లా తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రముఖ పురోహితులు, సిద్ధాంతి, పెన్నా మోహన్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ కర్త బ్రహ్మశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి రచించిన శ్రీ విశ్వాసు నామ సంవత్సర 2025- 26 పంచాంగాన్ని.. ఇవాళ హైదరాబాద్‌లో మంత్రులు వేర్వేరుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా పెన్నా మోహన్ శర్మ ప్రతి సంవత్సరం పంచాంగాలను రూపొందించి బ్రాహ్మణ సమాజానికి అందించడం హర్షనీయమన్నారు. బ్రాహ్మణ అర్చకులకు ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ధూప దీప నైవేద్య పథకంలో పనిచేస్తున్న అర్చకులు అందరికీ ప్రతినెల గౌరవ వేతనాలను ప్రభుత్వము అందచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పెన్నా మోహన్ శర్మతో పాటు ఆయన వెంట ప్రముఖ సిద్ధాంతి పంచాంగ కర్త దివిజ్ఞాన సిద్ధాంతి తదితరులు ఉన్నారు.

### ఈ నెల 4న నల్గొండలో పంచాంగ వితరణ..

రాష్ట్ర మంత్రులతో ఆవిష్కరించిన శ్రీ విశ్వాస నామ సంవత్సర పంచాంగ వితరణ కార్యక్రమం ఈ నెల 4న మంగళవారం నల్గొండలోని రాక్ హిల్స్ కాలనీలో నిర్వహిస్తున్నట్లు పంచాంగ రూపకర్త జిల్లా వైదిక బ్రాహ్మణ సంఘం నల్గొండ అధ్యక్షులు పెన్నా మోహన్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3: 15 గంటలకు రాఖీ హిల్స్ కాలనీ రోడ్ నెంబర్ 6లో నిర్వహించే



కార్యక్రమానికి ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా బ్రాహ్మణులు, అర్చకులు, పురోహితులు అందరూ హాజరై పంచాంగాలను స్వీకరించాలని కోరారు.

# వరంగల్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై
# కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కీలక వ్యాఖ్యలు

బన్సీలాల్ పేట్ : వరంగల్‌లోని మామునూరులో నూతన విమానాశ్రయాన్ని నిర్మించేందుకు కేంద్రం గ్రీన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేంద్ర పౌర, విమానయాన శాఖ మంత్రి కింజారాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని సేకరించి ఇస్తే వెంటనే పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ వార్తను ప్రజలతో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌లోని సీజీవో టవర్స్‌లోని పీఐబీ సెమినార్ హాల్‌లో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డితో కలిసి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. దేశంలోని ముఖ్యమైన రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలో ఇప్పటివరకు కేవలం ఒకే ఒక విమానాశ్రయం ఉన్నదని ఆయన అన్నారు. దీర్ఘకాలంగా ఉన్న ప్రజల డిమాండ్ దృష్టిలో పెట్టుకొని వరంగల్ సమీపంలోని మామునూరులో మరొక నూతన ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషకరమని ఆయన అన్నారు.దేశానికి స్వాతంత్రం రాకముందే 696 ఎకరాలలో మామూనూర్‌లో విమానాశ్రయం ఉండేదని రామ్మోహన్ నాయుడు గుర్తుచేశారు. 1981 వరకు అక్కడ విమాన సేవలు కొనసాగాయని ఆయన తెలిపారు. ఆ ఎయిర్‌పోర్టులో కేవలం 1800 మీటర్ల రన్ వే మాత్రమే ఉన్నదని, అది కూడా శిథిలావస్థకు చేరిందని పేర్కొన్నారు. సాధారణంగా ఎయిర్‌పోర్టు కోసం 2800 మీటర్ల రన్ వే ఉండాలనే నిబంధనలు ఉన్నాయని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 280 ఎకరాల స్థలాన్ని సేకరించాలని కోరడం జరిగింది చెప్పారు. ఇందుకోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్థల కొనుగోలు కోసం జీవో జారీ చేసిందని దీంతో నూతన ఏర్పాటుకు కేంద్రం అనుమతులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా మామునూరులో టెర్మినల్ భవనాన్ని నిర్మించాలని ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. ఎయిర్ పోర్టు నిర్మాణం జరిగితే కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం మాత్రమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని, ఉత్పత్తుల రంగానికి లాభం చేకూరుతుందని ఆయన అన్నారు.అత్యధిక జనాభా ఉన్న చిన్న చిన్న నగరాల్లో సైతం నూతన ఎయిర్‌పోర్టులను నిర్మిస్తున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. తెలంగాణలో కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం వద్ద, నిజామాబాద్‌లోని జక్రాన్ పల్లి లో కూడా నూతన విమానాశ్రయాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదన వచ్చాయని పేర్కొన్నారు. వాటి అనుకూలతపై విమానయాన శాఖ సర్వే నిర్వహిస్తుందని అన్నారు. 2008లో హైదరాబాద్‌లోలోని శంషాబాద్ సమీపంలో జీఎంఆర్ సంస్థ ద్వారా అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు జరిగిందని, 150 కిలోమీటర్ల లోపు రాబోయే 25 ఏళ్ల వరకు ఎలాంటి విమానాశ్రయాలు ఏర్పాటు చేయకూడదని అప్పట్లో షరతులు విధించడం జరిగిందని ఆయన తెలిపారు. అయితే ఇటీవల జీఎంఆర్ సంస్థ జనరల్ బాడీ మీటింగ్‌లోచర్చించి వారి తరఫు నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకున్నామని తెలిపారు.కేంద్ర గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అప్పటి కేంద్ర విమానయాన శాఖ



మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కలిసి వరంగల్ లో ఎయిర్ పోర్టు నిర్మించాలని పలుమార్లు కోరడం జరిగిందని గుర్తుచేశారు. తెలంగాణలో అనేక చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయని, ఇక్కడ సంస్కృతి ఎంత గొప్పదని ఆయన అన్నారు. ముఖ్యంగా రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు కోసం జరిగిన ఓటింగ్ లో మొదటిసారి ఓటమి గురయ్యామని, రామప్ప గుడికి దగ్గరలో ఎయిర్ పోర్ట్ లేకపోవడమే ఇందుకు కారణమని తెలిసిందన్నారు. దాంతో అప్పట్లోనే త్వరలో తాము వరంగల్ లో నూతన ఎయిర్ పోర్ట్ నిర్మిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు దేశాలకు హామీ ఇవ్వడం జరిగిందని చెప్పారు.

హామీలకు ఆయన ప్రస్తుతం మామునూరులో నూతన ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా తెలంగాణకు తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్ర ప్రజల తరఫున ప్రధాని మోదీకి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

## ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..?
# అయితే అయోడిన్ లోపం ఉన్నట్లే..!

మన శరీరానికి కావల్సిన అనేక పోషకాల్లో మినరల్స్ కూడా ఒకటి. వీటిల్లో చాలా ఉంటాయి. ఇక మినరల్స్‌లో అయోడిన్ కూడా ముఖ్యమైనదే. ఇది మన శరీరంలో అనేక విధులను నిర్వహిస్తుంది. థైరాయిడ్ పనితీరుకు, ఇతర అవయవాలకు మనకు అయోడిన్ అవసరం అవుతుంది. అయోడిన్ లోపిస్తే మన శరీరం పలు సంకేతాలను, లక్షణాలను తెలియజేస్తుంది. వాటిని గమనించడం ద్వారా మన శరీరంలో అయోడిన్ లోపం ఉందని అర్థం చేసుకోవచ్చు. ఇక అయోడిన్ లోపం ఉంటే ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. మన శరీరంలో అయోడిన్ లోపిస్తే శరీరం చల్లగా మారుతుంది. అంతేకాదు వాతావరణం ఎంత వేడిగా ఉన్నప్పటికీ దుప్పటి కప్పుకోవాలన్నంత చలిగా అనిపిస్తుంది.


### శరీర ఉష్ణోగ్రత..

అయోడిన్ మన శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. ఇది లోపిస్తే శరీరం చలిని తట్టుకోలేదు. దీంతో కొందరికి వణికినట్లు కూడా అనిపిస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తుంటే అయోడిన్ లోపం ఉన్నట్లు గుర్తించాలి. మీ చర్మం తరచూ పొడిబారుతుందా, దురద పెడుతుందా.. ఎంత మాయిశ్చరైజర్‌ను అప్లై చేసినా ఫలితం ఉండడం లేదా.. అయితే మీకు అయోడిన్ లోపం ఉండి ఉంటుంది. అయోడిన్ లోపిస్తే చర్మం తేమను కోల్పోతుంది. దీంతో ఎంత మాయిశ్చరైజర్‌ను అప్లై చేసినా కూడా చర్మం పొడిగానే మారి దురద పెడుతుంది. ఈ లక్షణం కనిపించినా కూడా అయోడిన్ లోపం ఉన్నట్లు తెలుసుకోవాలి.

### అలసట, నీరసం..

కొందరు రాత్రంతా సరిగ్గానే నిద్రపోయినా ఉదయం నిద్ర లేవగానే తీవ్రంగా అలసిపోయినట్లు, నీరసం వచ్చినట్లు మారిపోతారు. అయితే ఇందుకు అయోడిన్ లోపం కారణం అని చెప్పవచ్చు. ఎందుకంటే అయోడిన్ మన శరీరంలో శక్తి స్థాయిలను నియంత్రిస్తుంది. మనకు శక్తిని అందించేందుకు అయోడిన్ అవసరం. అది లోపిస్తే శక్తి లేనట్లు అనిపిస్తుంది. కనుకనే ఉదయం నిద్ర లేచిన వెంటనే అలసట, నీరసం ఉంటాయి. ఈ రెండు లక్షణాలు ఉంటే దాన్ని కూడా అయోడిన్ లోపంగా భావించాలి. అలాగే మీ మెడ లేదా గొంతు భాగంలో ఏదైనా కొవ్వు గడ్డలా వచ్చిందా..? అయితే ఇది అయోడిన్ లోపం వల్లనే అని గుర్తించాలి. మన శరీరంలో తగినంతగా అయోడిన్ లేకపోతే ఇలాంటి కొవ్వు గడ్డలు ఏర్పడుతుంటాయి. థైరాయిడ్ గ్రంథి మన శరీర మెటబాలిజంను నియంత్రించాలంటే అందుకు అయోడిన్ అవసరం అవుతుంది. అయోడిన్ లోపిస్తే మెటబాలిజం సరిగ్గా ఉండదు. దీంతో గొంతు లేదా మెడపై కొవ్వు గడ్డలు ఏర్పడుతుంటాయి. ఈ లక్షణం కూడా అయోడిన్ లోపం ఉంటేనే కనిపిస్తుంది.

### ఏకాగ్రత, జ్ఞాపకశక్తి..




శరీరంలో అయోడిన్ లోపిస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గిపోతాయి. ఏ పని మీద దృష్టి పెట్టలేకపోతుంటారు. పనిపై లేదా ఇతర విషయాలపై ధ్యాస ఉండదు. బద్ధకంగా ఉంటారు. మెదడు మొద్దుబారిపోయినట్లు అనిపిస్తుంది. చికాకుగా ఉంటుంది. ఇక మహిళల్లో అయోడిన్ లోపం ఉంటే నెలసరి సరిగ్గా రాదు. లేదా పీరియడ్స్ టైముకు రావు. నెలసరిలోనూ కొందరికి తీవ్ర రక్త స్రావం అవుతుంది. కొందరికి మాటి మాటికీ రక్త స్రావం అవుతూనే ఉంటుంది. అలాగే అయోడిన్ లోపం జుట్టుపై కూడా ప్రభావాన్ని చూపిస్తుంది. దీంతో జుట్టు బలహీనంగా మారి పలుచబడుతుంది. జుట్టు రాలిపోతుంది. ఇలా అయోడిన్ లోపం ఉంటే పలు లక్షణాల ద్వారా దాన్ని గుర్తించవచ్చు. దీంతో డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవచ్చు.

# నూతన నియామకం



**హైదరాబాద్-మీడియా టుడే-మార్చి 2:** శంషాబాద్ కు చెందిన రాచమల్ల వర్ధన్ ను ఎన్ఎస్ యుఐ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా ఆదివారం నియమించారు. కష్టపడ్డ వారికి పార్టీ ఎల్లవేళలో తోడుండి వాళ్ళని ప్రోత్సహిస్తూ వాళ్లకు గుర్తింపునిస్తుందని... దళిత కుటుంబానికి చెందిన రాచమల్ల వర్ధన్ ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పదవీ ఇవ్వడం జరిగింది.

# శ్రీ మల్లికార్జున స్వామి గొల్ల కేతమ్మ జాతర..



**రాయికల్-మీడియా టుడే-మార్చి 2:** రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామ శివారులో గల శ్రీ మల్లికార్జున స్వామి గొల్ల కేతమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. స్వామి వారి లగ్గ పట్నాలు, బోనాలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. మంగళవారం నాగవెల్లి పట్నం, అగ్గిగుండాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని యాదవ సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి...



**రాయికల్-మీడియా టుడే-మార్చి 2:** రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో ఎంఎన్సి కంపెనీ.. ఏనుగు దయానంద రెడ్డి (వసంత టూల్స్ క్రాఫ్ట్ కంపెనీ) ఆధ్వర్యంలో ఆదివారం నిరుద్యోగ మహిళలకు మెగా జాబ్ మేళా నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన సుమారు 50 మంది మహిళ అభ్యర్థులను ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేశారు. ఎంపికైన వారికి వేతనంతో పాటు ఉచిత వసతి రవాణా ఉంటుందని ప్రతినిధులు పేర్కొన్నారు. గ్రామీణ యువత ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలని మాజీ సర్పంచ్ తురగ రాజారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు యువంగ్ చెయిన్ (నిక్), వీరా, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నిర్వాహకులు తుమ్మల సదాశివరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ బాలె శేఖర్, నాయకులు గండ్ర అచ్యుతరావు, తోపారపు రవి, వీరబత్తిని శంకర్, ఎలిగేటి రామకృష్ణ, బాలే నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జన ఔషధి దినోత్సవం..




**రాయికల్: మీడియా టుడే :మార్చి 2:** మార్చి రెండవ తేదీ ప్రధానమంత్రి జన ఔషధీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీ చౌక్ వద్దగల జన ఔషధీ మందుల దుకాణం వద్ద ఉచిత జన ఆరోగ్య మేళా ను ఘనంగా నిర్వహించారు. ఆర్.ఎం.పి వైద్యులు మహేంద్ర బాబు, జలంధర్ లచే వివిధ రకాల వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రమేష్ మాట్లాడుతూ పేదవారికి చౌక ధరలలో అందుబాటులో ఉండే మందులు జన ఔషధీలో లభిస్తాయని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## మద్యం విక్రయిస్తే రూ.25 వేలు ఫైన్..
# గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



గ్రామంలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతుండటంతో గ్రామస్తులంతా ఒక్కటయ్యారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి సమావేశమయ్యారు. బెల్ట్ షాపులను నిషేధించాలని నిర్ణయం తీసుకున్నారు. భూదాన్ పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామస్తులు బెల్ట్ షాపులను నిషేధిస్తూ ఇంద్రియాల గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలో బెల్ట్ షాపులు ఉండకూడదని అందరూ ప్రతిజ్ఞ చేశారు. మద్యం విక్రయిస్తే 25 వేల రూపాయల జరిమానా, సమాచారం ఇచ్చిన వారికి 5000 రూపాయలు బహుమానమని ప్రకటించారు. బెల్ట్ షాపులను గ్రామస్తులు నిషేధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం అధ్యక్షులుగా

# సిద్ధం శెట్టి రమణ ఏకగ్రీవం




**మీడియా టుడే, కామారెడ్డి, మార్చ్ 2:** కామారెడ్డి పట్టణంలోని గాంధీ నగర్లో గల ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం లో ఎన్నికల అధికారులు మోటూరి పురుషోత్తం, చాట్ల లింగం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం అధ్యక్షులుగా సిద్ధంశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శి నంగులూరి వెంకటేశం, కోశాధికారిగా శిల వెంకట రాజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం అధ్యక్షులు సిద్ధంశెట్టి రమణ, ప్రధాన



కార్యదర్శి నంగునూరి వెంకటేశం, కోశాధికారి వెంకట రాజయ్య మాట్లాడారు రెండు సంవత్సరాలుగా ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్య అభివృద్ధి సంఘ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

మా మీద నమ్మకముతో మమ్ములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మా వంతుగా సహాయ సహకారం చేస్తామని తెలిపారు. నిరుపేద ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులకు తోడ్పాటు అందిస్తామని, పైన అంతస్తు కూడా సంఘ సభ్యుల సహకారంతో కట్టిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సునీల్ కుబ్బ, వెంకట రాజం, తృప్తి అనిల్, కాముని సందీప్, కస్పా శ్రీనివాస్, పప్పుల సోమశేఖర్, ఆర్యవైశ్య అభివృద్ధి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## స్వయం కృషితో అంబేద్కర్ గ్రౌండ్ పరిశుభ్రం



**మీడియా టుడే గరిడేపల్లి:** గరిడేపల్లి మండలపరిధిలోని రాయినిగూడెం గ్రామంలో అంబేద్కర్ గ్రౌండ్ లో నిల్వ ఉన్న చెత్త చెదారం ను ఆదివారం విద్యార్థులుచూసి స్వయంకృషితో గ్రౌండ్ లో ఉన్న చెత్తాచెదారాలను తీసివేసి పరిశుభ్రం చేశారు . గ్రౌండ్ పరిశుభ్రంగా ఉంచాలని ఆటలుఆడుకోవడానికి ఈ పరిశుభ్రతను చేపట్టామని విద్యార్థులు తెలిపారు. కాలనీ ప్రజలు చెత్త చెదారం గ్రౌండ్లో వెయ్యకుండాగ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు ఆ ట్రాక్టర్లలో వెయ్యాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రత్నరాజ్, శశి, లక్కీ, పార్థు, చెర్రీ,శ్రీరామ్, అరవింద్, నాని, భగత్, రిషి, మనోజ్, గౌతమ్, బిట్టు, సన్నీ, బన్నీ, నవదీప్,కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

### ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా

# అమలు చేయాలి - సేవలాల్ సేన



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మార్చి 2( మీడియా టుడే):** భద్రాచలం మండల సుందరయ్య నగర్ కాలనీ యందు సేవాలాల్ సేన మండల అధ్యక్షులు బోద వీరేందర్ నాయక్ ఆధ్వర్యంలో మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ హాజరై మాట్లాడుతూ.. జిల్లాలో ఏజెన్సీ చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు 1/70 యాక్టు,పీసా యాక్టు చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని అమలు చేయాల్సిన అధికారులే ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతూ గిరిజన ప్రజలకు అన్యాయం చేస్తా ఉన్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో టెండర్లను గిరిజన ప్రజలకే ఇవ్వాలన్న చట్టాలు ఉన్నప్పటికీ వాటికి ఉల్లంఘన చేస్తూ గిరిజనేతురులకు కేటాయిస్తా ఉన్నారని అన్నారు భద్రాచలం ఐటిడిఏ పరిధిలో ఉన్న టెండర్లను గిరిజనేతరులకు ఎక్కువ టెండర్లు కేటాయిస్తూ గిరిజన ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న అధికారుల పనితీరు గిరిజన ప్రజల ఆచారాలు సాంస్కృతి సంప్రదాయాల పట్ల ఎలాంటి అవగాహన లేదని కనీసం గిరిజన ప్రజల జీవన విధానాన్ని అర్థం చేసుకొని ఏజెన్సీ ప్రాంతాలలో గల చట్టాలకు లోబడి పని చేయాల్సిన ఉన్న అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయకుండా కేవలం షెడ్యూల్ ప్రాంతాల్లో గల వనరులను అభివృద్ధి పేరిట అంటగడుతూ భద్రాద్రి జిల్లాలో ఉన్న గిరిజన ప్రజల జీవనానికి ఆటంకాలు కలిగిస్తున్నారని అన్నారు గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయకుండా ఎదేచ్చగా అక్రమ నిర్మాణాలు అక్రమంగా ఇసుక గ్రావెల్ మట్టి తోలకాలను ప్రోత్సహించడానికి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని చట్టాలు అమలు చేయాలని కోరుతున్న గిరిజన నాయకులను బెదిరించడం భయభ్రాంతులకు గురి చేయడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదని ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులు కానీ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రక్షణ కొరకు ప్రత్యేకంగా పనిచేస్తున్న ఐటీడీఏ పిఓ మరియు జిల్లా కలెక్టర్ సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అన్నారు 1/70 యాక్ట్ ,పీసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోతే సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటిడిఏ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్ రమేష్ నాయక్ కిషన్ నాయక్ సీతారాం నాయక్ సురేష్ నాయక్ శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఐ వి ఎఫ్ రక్తదాన కార్యక్రమాలు అభినందనీయం

### - ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు ఐవిఎఫ్ కే గర్వ కారణం.. - ఐవిఎఫ్ ఢిల్లీ అధ్యక్షులు అశోక్ అగర్వాల్..







**మీడియా టుడే, కామారెడ్డి, మార్చ్ 2:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషనల్ (ఐవిఎఫ్) మరియు కామారెడ్డి రక్తదాతల సమూహము ఆధ్వర్యంలో సంవత్సరకాలంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 22 మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి 2306 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఈ ఘనతను సాధించిన మొట్టమొదటి సంస్థగా భారతదేశంలో నిలపడం అభినందనీయమని హైదరాబాదులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐవిఎఫ్ ఢిల్లీ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ అన్నారు. ఈ విజయానికి కారకులైన తెలంగాణ ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా మరియు సేవాదళ్ చైర్మన్ డాక్టర్ బాలు,కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్, ఉపాధ్యక్షులు గంప ప్రసాద్ ఎర్రం చంద్రశేఖర్ లను అభినందించి సన్మానించడం జరిగింది.

ఈ సందర్భంగా అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ దేశంలోనే ఇప్పటివరకు ఏ సంస్థ సాధించినటువంటి రికార్డును తలసేమియా చిన్నారుల కోసం రక్తాన్ని అందజేయడం ద్వారా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ మరియు కామారెడ్డి రక్తదాతల సమూహం జరిగిందని, చిన్నారుల ప్రాణాలను కాపాడు కోసం ఇప్పటివరకు 4500 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించి తల సేమియా సికిల్ సెల్ సొసైటీ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలకు అందజేయడం సాధారణ విషయం కాదని సకాలంలో రక్తాన్ని అందజేస్తూ చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలకు సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

### డైరెక్టర్ (ఆపరేషన్స్), డైరెక్టర్ (పి&పి )లకు

# ఐ ఎన్ టి యు సి ఆత్మీయ సన్మానం





**మణుగూరు, మార్చి 2 (మీడియా టుడే):** సింగరేణి కాలరీస్ నూతన డైరెక్టర్ (ఆపరేషన్స్ ), ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు లను కొత్తగూడెం కార్పొరేట్ ఆఫీసులో మణుగూరు ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐ ఎన్ టి యు సి – సింగరేణి కాలనీ స్కూల్ మైన్స్ లేబర్ యూనియన్ బ్రాంచ్ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, కొత్తగూడెం రీజియన్ జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్ ,బ్రాంచ్ సెక్రటరీలు షాబుద్దీన్ , సూరపాక రాములు,అబ్దుల్ రవూఫ్,సెంట్రల్ కమిటీ నాయకులు బుర్ర వెంకటేశ్వర్లు,బానోత్ కృష్ణ,మరియు బ్రాంచ్ నాయకులు పుసులూరు రామారావు,రామకృష్ణ,గోపి,ప్రతాప్ రెడ్డి,మల్లికార్జున్,అజిత్, అశోక్,ట్రెజరర్ మిద్దెపాక శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

### రామంతపూర్ హెూమియో కళాశాల

## వైస్ ప్రిన్సిపాల్‌కు జాతీయ అవార్డు.

రామంతపూర్, మార్చి 2 : రామంతపూర్ ప్రభుత్వ హెూమియో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చారబుడ్డి శ్రీనివాస్ రెడ్డిని డాక్టర్ మహేంద్ర సింగ్ మెమోరియల్ జాతీయ ఉత్తమ అధ్యాపక అవార్డు పురస్కారం వరించింది. ఆదివారం కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి గత 34 ఏళ్లు హెూమియో వైద్య రంగానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందుకున్నారు. డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామం వరంగల్ జిల్లా నెలపోగుల గ్రామం. ఆయన తన 34 ఏళ్ల కెరీర్‌లో గొప్ప వైద్యుడిగా, అధ్యాపకుడిగా, పరిశోధకుడిగతా మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం కాళోజీ నారాయణ రావు వైద్య యూనివర్సిటీకి, హెూమియోపతి బోర్డు ఆఫ్ స్టడీస్‌కుచైర్మన్‌గా ఉన్నారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, విజయవాడ బోర్డు ఆఫ్ స్టడీస్‌కు ఎక్స్‌టర్నల్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. అలాగే జీఎస్‌పీఎస్ రామంతపూర్ హెూమియో కాలేజీలో పీజీ కో ఆర్డినేటర్ గా ఉన్నారు. శ్రీనివాస్ రెడ్డి కృషితో హెూమియో వైద్య కళాశాల దేశంలోని ఉత్తమ కళాశాలల్లో ఒకటిగా పేరు తెచ్చుకున్నది. ఈయన దగ్గర చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత పదవులలో ఉన్నారు. ఆయన కృషి ని గుర్తించి ఈ బెస్ట్ టీచర్ అవార్డును ప్రదానం చేస్తున్నామని డాక్టర్ మహేంద్ర సింగ్ అవార్డ్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ సుభాష్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది,విద్యార్థులు, హెూమియో డాక్టర్ అందరు శ్రీనివాస రెడ్డి కి అభినందనలు తెలిపారు. తనకు అవార్డు రావడం పట్ల శ్రీనివాస్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

### అపరేషన్ కగార్ అప్రజాస్వామికం.. అడవుల్లోని బలగాలను వెనక్కి తీసుకురండి.. ప్రజా సంఘాల ఆగ్రహం



జవహర్‌నగర్: ఆపరేషన్ కగార్ అప్రజాస్వామికమని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. మావోయిస్టు రహితంగా చేస్తామని చెబుతున్న బీజేపీ మొండి వైఖరిని విడనాడి.. వెంటనే కేంద్ర, రాష్ట్ర బలగాలను అడవుల్లో నుంచి వెనక్కి రప్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. జవహర్‌నగర్‌లోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో పీఓడబ్ల్యూ (విముక్తి) రాష్ట్ర నాయకురాలు సునీత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాడాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మతతత్వ, సామ్రాజవాద, కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా విద్వేషపూరితమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించకుండా పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసి మహిళలు, యువకులు, పిల్లలపై ఆధునాతన మరణాయుధాలతో యుద్ధానికి తెగబడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేస్తూ అడవుల్లో తిష్టవేసిన పారామిలటరీ బలగాలను వెనక్కి పిలవాలని డిమాండ్‌చేశారు. మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాలలో జరిగే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పీఓడబ్ల్యూ(విముక్తి) రాష్ట్ర నాయకురాలు సునిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్ షావలి, నాయకులు కొన్నె వేణు, రషీద్, సిగరాయగౌడ్, యాకస్వామి, చంద్రన్న, ప్రసాద్, రాంరెడ్డి, యాదగిరి, విజయ్, శంకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఏపీలో ట్రాఫిక్ కొత్త రూల్స్ అమలు.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ. 10వేల వరకు జరిమానా %ఘతీటటఅఎ తీబశ్రీవం% ఎ రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ఏపీ సర్కార్ కొత్త ట్రాఫిక్ రూల్స్‌ను అమలు చేస్తుంది. ఇకపై ట్రాఫిక్‌ను ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై భారీ జరిమానా విధిస్తుంది.

## ఏపీలో ట్రాఫిక్ కొత్త రూల్స్ అమలు..

### సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ. 10వేల వరకు జరిమానా



అమరావతి : రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ఏపీ సర్కార్ కొత్త ట్రాఫిక్ రూల్స్‌ను అమలు చేస్తుంది. ఇకపై ట్రాఫిక్‌ను ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై భారీ జరిమానా విధిస్తుంది. ఏపీ హైకోర్టు ఆదేశాలతో కొత్త రూల్స్ శనివారం నుంచి ప్రారంభమయ్యింది . విజయవాడలో ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మూడు నెలలుగా విజయవాడలో నో హెల్మెట్.. నో ఎంట్రీ రూల్ అమలు చేస్తున్నారు. ఆ రూల్స్‌తో పాటు మరికొన్ని ఆంక్షలు అమల్లోకి తీసుకొచ్చారు. కేంద్ర మోటార్ వెహికల్ చట్టంలోని 12 రకాల కొత్త నిబంధనలను అమలు అవుతుండగా వాహనదారులు అతిక్రమిస్తే భారీ జరిమానాలు విధించనున్నట్లు కొత్త సర్క్యులర్‌ను కూటమి ప్రభుత్వం జారీ చేసింది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ఇదివరకు రూ. 1,500 ఉన్న జరిమానాను ఏకంగా రూ. 10 వేల వరకు పెంచారు. హెల్మెట్ ధరించకుంటే రూ. వెయ్యి, బైక్ వెనక కూర్చున్న వ్యక్తి హెల్మెట్ ధరించకుంటే రూ. వెయ్యి ఫైన్ వేయనున్నారు. ఇన్సురెన్స్ లేకుంటే రూ. 2 వేలు నుంచి రూ. 4వేల జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే ఏకంగా రూ. 5వేలు జరిమానా, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే రూ. 1,500లు , ఆటో, లారీ డ్రైవర్లు యూనిఫామ్ ధరించకుంటే రూ. 150 నుంచి 300 వరకు ఫైన్ కట్టాల్సి ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. కారు డ్రైవర్‌తోపాటు.. ప్రయాణికులు సీట్ బెల్ట్ ధరించకుంటే ఒక్కొక్కరికి రూ. వెయ్యి, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుంటే 2వేలు నుంచి 5వేల వరకు జరిమాన వేస్తామన్నారు. అతివేగంతో వాహనం నడిపినా, బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేసినా రూ. వెయ్యి జరిమానా ఉంటుందన్నారు. కారు , బైక్ రేసింగ్‌లకు పాల్పడితే రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు జరిమానా కట్టాల్సి ఉంటుందని విజయవాడ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు.

### ఒకే ఊళ్లో వెయ్యి కోళ్లు మృతి..

## రైతు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



కొల్చారం, : మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్‌లో అంతుచిక్కని వ్యాధితో వెయ్యి కోళ్లు మరణించాయి. సతీశ్ గౌడ్ అనే పౌల్ట్రీ రైతు కోళ్ల ఫారమ్‌లో ఆదివారం నాడు గంటల వ్యవధిలో వెయ్యి కోళ్లు మృత్యువాతపడటం కలకలం రేపాయి. ఈ కోళ్లు ఎండ తీవ్రతతో చనిపోలేదని.. దీనికి సంబంధించి యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని చెబితే పశు సంవర్ధక శాఖ అధికారులు, కోడి పిల్లలను పంపిణీ చేసిన సూపర్‌వైజర్లు ఎవరూ పట్టించుకోవడం లేదని సతీశ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోళ్ల అకాల మరణంతో బర్డ్ ఫ్లూ సోకిందేమోనని భయభ్రాంతులకు గురవుతున్నామని సతీశ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోళ్ల అకాల మరణంతో సుమారు రెండు లక్షల వరకు నష్టపోయామని.. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ విషయంపై పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్యను వివరణ కోరగా.. జిల్లాలో ఇప్పటివరకు బర్డ్ ఫ్లూ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు.




## అవన్నీ ఫేక్.. మీనాక్షి చౌదరి వార్తలపై
# స్పందించిన ఏపీ ప్రభుత్వం

టాలీవుడ్ బ్యూటీ మీనాక్షి చౌదరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా శక్తీకరణ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై ఏపీ ప్రభుత్వంకి సంబంధించిన సోషల్ మీడియా ఫ్యాక్ట్ చెక్ వింగ్ స్పందిస్తూ ఆ వార్తలు ఫేక్ అని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ బ్రాండ్ అంబాసిడర్‌గా హీరోయిన్ మీనాక్షి చౌదరిని నియమించారని సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం పూర్తిగా ఫేక్. ప్రభుత్వం పేరుతో ఉద్దేశపూర్వకంగా ఇటువంటి తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపై, ఫేక్ ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారమైన చర్యలు ఉంటాయి. అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకి చెందిన ఫ్యాక్ట్ చెక్ వింగ్ సోషల్ మీడియా వేదికగా రాసుకొచ్చింది.

## హిమాలయాలకు వెళ్లనున్న
# అఖండ-2

బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ-2' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. బ్లాక్‌బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్ ఇది.



బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ విజయాలు నమోదవడంతో ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. తదుపరి షెడ్యూల్ కోసం దర్శకుడు బోయపాటి శ్రీను హిమాలయాల్లో లొకేషన్ రెక్కీ చేస్తున్నారు. అక్కడి సుందరమైన ప్రదేశాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను తెరకెక్కించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ సీన్స్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదలకానుంది. సంయుక్త మీనన్, ఆది పినిశెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపీ ఆచంట, రచన-దర్శకత్వం: బోయపాటి శ్రీను.

# త్రివిక్రమ్‌పై మరోసారి
## సంచలన ఆరోపణలు చేసిన
# పూనమ్ కౌర్



నటి పూనం కౌర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తెలుగులో చేసింది కొన్ని సినిమాలే అయినా ఈ పంజాబీ బ్యూటీకి తెలుగులో మంచి గుర్తింపు ఉంది అని చెప్పవచ్చు. అయితే ఈ భామ ఈ మధ్య వరుసగా దర్శకుడు త్రివిక్రమ్‌ని విమర్శిస్తూ పోస్ట్‌లు పెడుతున్న విషయం తెలిసిందే. త్రివిక్రమ్ ఎలాంటి వాడో, ఆయన చెడు స్వభావం ఎంటో నాకు తెలుసు. ఇతరుల జీవితాలను త్రివిక్రమ్ నాశనం చేస్తారు. అంటూ అప్పట్లో సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇదిలావుంటే తాజాగా పోసాని కృష్ణ మురళి అరెస్ట్‌పై పూనం కౌర్ స్పందిస్తూ.. ఈ విషయంలో కూడా త్రివిక్రమ్‌ను లాగి మరోసారి అతడిపై ఆరోపణలు చేసింది. సోషల్ మీడియా వేదికగా పూనం స్పందిస్తూ.. పోసాని కృష్ణ మురళి చేసిన మరో తప్పు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ఇండస్ట్రీలోకి తీసుకురావడం అంటూ కామెంట్ చేసింది. దీంతో ఈ కామెంట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. పూనమ్ కౌర్ గతంలోనూ త్రివిక్రమ్‌పై పలు సందర్భాల్లో ఆరోపణలు చేసింది. ఆమె తన కెరీర్‌లో ఎదుర్కొన్న ఇబ్బందులకు త్రివిక్రమ్ కారణమని, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (%హీూూ%)కి ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని గతంలో పేర్కొంది.



## దక్షిణాదిలో నటిగా
# కొనసాగడం కష్టం

'నా 28వ ఏటే ఇద్దరు పిల్లలకు తల్లిని అయ్యాను. ఆ తర్వాత కూడా ఎన్నో విభిన్నమైన పాత్రలు చేశా. కానీ స్టార్ హీరోల సరసన మాత్రం అవకాశాలు రాలేదు. దానికి కారణం.. నేను వివాహితనవ్వడమే.' అంటూ వాపోయారు నటి జ్యోతిక. ఇటీవలే ఆమె నటించిన 'డబ్బా కార్టెల్' వెబ్ సిరీస్ ఓటీటీలో విడుదలైంది. ఈ సిరీస్ ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దక్షిణాది చిత్రపరిశ్రమపై కొన్ని వ్యాఖ్యలు చేశారు జ్యోతిక.'గతంలో నాలాంటి మహిళల కోసమే కథలు రాసే సంస్కృతి ఉండేది. గ్రేట్ డైరెక్టర్ కె.బాలచందర్ మహిళా నేపథ్యంలోనే ఎన్నో కథలు రాశారు. సినిమాలు తీశారు. పెద్ద పెద్ద నిర్మాతలు కూడా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు నిర్మించేవాళ్లు. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. అగ్ర హీరోలదే హవా. స్త్రీ ప్రాధాన్యతా చిత్రాలు తగ్గిపోవడానికి బడ్జెట్ కూడా ఓ కారణమైతే.. మనసు లేకపోవడం మరో కారణం. ముఖ్యంగా స్త్రీల కోసం కథలు రాసే రచయితలు ఇప్పుడు లేరు. అందుకే దక్షిణాదిలో నటిగా కొనసాగడం కష్టం. సిద్ధాంతాలకు కట్టుబడి సినిమాల్లో నటించే స్త్రీలు అక్కడ ఒంటరిపోరు చేయాల్సొస్తుంది. కానీ ఉత్తరాదిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇక్కడ ఇంకా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు వస్తున్నాయ్. ఈ విషయంలో బాలీవుడ్ దర్శక, నిర్మాతలను, రచయితలను అభినందించకుండా ఉండలేకపోతున్నా.' అన్నారు జ్యోతిక.

# శివంగి ప్రతీకారం

ఆనంది, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో దేవరాజ్ భరణి ధరన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శివంగి'. నరేష్ బాబు పి నిర్మాత. ఈ నెల 7న విడుదలకానుంది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'అందరి జీవితంలో గుడ్‌డే, బ్యాడ్‌డే అని ఒక రోజు ఉంటుంది. కానీ నా జీవితంలో రెండూ ఒకే రోజు జరిగాయి' అంటూ ఆనంది చెప్పిన సంభాషణతో మొదలైన ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. వరలక్ష్మి శరత్‌కుమార్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించింది. మహిళా ప్రధానంగా సాగే థ్రిల్లర్ చిత్రమని, రివేంజ్ నేపథ్య కథాంశమని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఏ. హెచ్. కాషిఫ్, ఎబినేజర్‌పాల్ సంగీతాన్నందించారు.



## రీఎంట్రీకి
# సిద్ధమైనరంభ



ఒకప్పుడు అగ్ర కథానాయికల్లో ఒకరిగా రాణించింది రంభ. తొంభై దశకంలో యువతరంలో మంచి క్రేజ్ సంపాదించుకొని పలు విజయవంతమైన చిత్రాల్లో భాగమైంది. కొన్నేళ్లుగా సినీ రంగానికి దూరంగా ఉంటున్న ఆమె తాజాగా రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా రంభ మాట్లాడుతూ 'సినీరంగంలోకి పునరాగమనానికి ఇదే సరైన సమయం అనుకుంటున్నా. నా వయసుకు తగినట్లు చాలెంజింగ్ రోల్స్ చేయడానికి సిద్ధంగా ఉన్నా. మంచి పాత్రల ద్వారా తిరిగి ప్రేక్షకుల అభిమానం సంపాదించుకోవాలనుకుంటున్నా' అని చెప్పింది.

Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 11, Issu: 232